# పంపకాలు

చైత్ర పూర్ణిమ, ఫాక్టరీల పొగలేని కారణంగా ఆ పల్లెటూళ్లో పొలం గట్ల మీద వెన్నెల అహ్లాదాన్నిస్తోంది. విశ్వనాథంగారూ, పార్వతమ్మా ఊళ్లో ఉన్న ఏకైక సినిమా హాల్లో సినిమా చూసి తిరిగి వస్తున్నారు. ఆరోజు వాళ్ల పెళ్లిరోజు. పొద్దుట గుళ్లో పూజ, సాయంత్రం ఊళ్లో ఉన్న హాల్లో సినిమా, మధ్యతరగతి కుటుంబాలలో పెళ్లిరోజు అంతకన్నా ఘనంగా ఏం జరుపుకోగలరు కనుక? పార్వతమ్మ ఏదో ఆలోచనలో ఉందో, ఆయాసపడుతోందో కానీ మెల్లిగా, మాట్లాడకుండా నడుస్తోంది. సినిమా కథ గురించి మాట్లాడుతూ నడవటం ఆవిడకు అలవాటు.

"ఏం పార్వతీ, రిక్షా పిలవమంటావా?"

"వద్దండీ నడుద్దాం. ఏమంత దూరం కనుక?"

చూసిన సినిమా "బడి పంతులు." వార్ధక్యంలో తల్లి తండ్రుల్ని పిల్లలు బాధించిన కథ. 'బహుశః సినిమా ఆవిడను కదిల్చివేసి ఉంటుంది. అసలే సున్నితమైన మనస్సు. అందుకే మాట్లాడడం లేదు కాబోలు' అనుకున్నారు విశ్వనాథం గారు.

ఇంటికొచ్చాక వీధి అరుగు మీద కూచున్నారు విశ్వనాథంగారు. రెండు గ్లాసులతో పాలూ, నాలుగరిటిపళ్ళూ పట్టుకొచ్చింది పార్వతమ్మ. అంతకన్నా తిని అరిగించుకునే వయస్సూ లేదు; తినాలన్న మనస్సూ లేదు.

"మన పెళ్లయి అరవై సంవత్సరాలయింది. ఈ వేళకి పార్వతీ. అరవై ఏళ్లు నిండితేనే ఎంతో గొప్పగా షష్టి పూర్తి చేసుకుంటారు. పెళ్లయి అరవై ఏళ్లంటే ఇంకెంత గొప్పంటావు?

నిజమే ప్రేమ. పెళ్ళి, సంసారం వంటి మాటలకు అర్థాలు కూడా తెలియని రోజుల్లో పెళ్లయింది. పెళ్ళిలో విశేషాలు కూడా పెద్దవాళ్లు చెప్తే వినడమే. పల్లకీలో ఆయన ఒళ్లో తలపెట్టుకుని నిద్రపోయిందిట తను. అరవై సంవత్సరాల అనుబంధం తమది. ఉన్న ఊళ్లోనే మేనరికం. ఏనాడూ వదిలి ఉండాల్సిన అవసరం లేదు. పండుగలైనా, పురుడైనా అన్నీ ఉన్న ఊళ్లోనే. కానుపు ఆలస్యమైనా తనని ఏమనలేదు. ఇంకో పెళ్లిమాట ఆరోజుల్లో కూడా తలపెట్టలేదు. ఎంత అదృష్టవంతురాలు తను. దేవుడి లాంటి భర్త. ముత్యాల్లాంటి పిల్లలు. ఆలోచన ఒక్కసారి ఆగిపోయింది. "ముత్యాల్లాంటి పిల్లలా. ఏమో."

"ఏమిటి పార్వతీ ఇందాకటి నుంచీ ఆలోచిస్తున్నావు?"

"ఇందాకటి సినిమా కథే. మీరు కూడా స్కూలు టీచర్‌గానే రిటైరయ్యారు కదా?

"ఊఁ అయితే"

"మన పిల్లలు కూడా మనని ఇలాగే పంచుకుంటారా? ఇద్దరి బాధ్యత ఒకళ్లు స్వీకరించరంటారా?"

"పిచ్చి పార్వతీ! అది సినిమా కథ. నిజజీవితంలో అలా ఉండదు. అయినా మనకి ఒకమ్మాయి. ఒకబ్బాయి కదా! కొడుకులు పంచుకోడం ప్రశ్నేలేదు."

"ఏమో! ఇద్దరికీ సమానంగానే చదువు చెప్పించాం. ఇప్పుడంతా ఆడా, మగా సమానం, ఆస్తిహక్కు సమానం అంటున్నారు కదా. అలాగే బాధ్యతలూ సమాన మంటారేమో!"

"ఛ! మన పిల్లలలాంటి వాళ్లు కారు పార్వతీ. వాళ్లెప్పటికీ మన బాధ్యతలు పంచుకోరు. ఇద్దర్నీ ఒకళ్లే ఉండమంటారు ఒక్క చోట్లోనే."

పార్వతమ్మ ముఖంలో నమ్మకం కనిపించలేదు.

"పోనీ వాళ్లెలాంటి వాళ్లయినా మన బాధ్యత స్వీకరించాల్సిన అవసరం వాళ్లకి లేదు నాకు పెన్షన్ వస్తోంది. నాలుగెకరాల భూమి ఉంది. ఏదో చిన్న పెంకుటిల్లుంది. ఇంక కావల్సిందేముంది. మనిద్దరికీ రోజులు వెళ్లిపోతాయి. నువ్వు అనవసరంగా భయపడకు."

పార్వతమ్మ కళ్లల్లోకి కొంచెం వెలుగొచ్చింది.

ఆ ప్రసన్నత అలాగే ఉండాలని చిన్ననాటి కబుర్లు చెప్పసాగారు విశ్వనాథంగారు. "మన పెళ్లి తల్చుకుంటే ఇప్పుడు నవ్వొస్తుంది కదూ పార్వతీ. నీకు బావా అని పిలవడమే అలవాటుగా ఉండేది. ఎంత ప్రయత్నించీ పెద్ద వాళ్లు మాన్పించలేకపోయే వారు."

ముడుతలు పడ్డ ఆవిడ మొహంలో సిగ్గుతో కూడిన చిరునవ్వు కనిపించింది.

"మీ అమ్మమ్మ చేసిన అరిసెలు నాకు రహస్యంగా తెచ్చి పెట్టడం జ్ఞాపక మొస్తుంది పార్వతీ".

"ఎప్పుడూ మీకు పెట్టకుండా ఏం తినాలనిపించదు నాకు. మీరు మాత్రం జామ చెట్టు మీదనుంచి నేను కిందపడితే ఇంజక్షన్ మందుకు ఆరు మైళ్లు ఎండలో సైకిలు మీద వెళ్లలేదా? అప్పుడు మీ వయసెంతనీ. పన్నెండు పదమూడో!"

చిన్ననాటి ముచ్చట్లు ఆనందంతోపాటు ఆమెలో మళ్లీ దిగులునూ తెచ్చాయి.

"ఏనాడూ మిమ్మల్ని వదిలి ఉండలేదు."

"ఏనాడూ ఉండే అవసరమూ రాదు. ధైర్యంగా పడుకో. అన లీ వేళ సినిమాకి వెళ్లకుండా ఉండాల్సింది."

"మీ మాట మీదే భరోసా ఉంచి పడుకుంటున్నాను. అన్నట్లు అమ్మాయిని పురిటికి తీసుకొచ్చే విషయం ఉత్తరం రాశాము. ఇంకా జవాబు రాలే దెందుకనో!"

"అమ్మాయీ, అల్లుడూ ఇద్దరు ఉద్యోగాలు చేస్తున్నారు. జవాబు రాయడానికి తీరికుండాలిగా. నేడే, రేపో వస్తుందిలే.

❖ ❖ ❖

నాలుగురోజుల తర్వాత పార్వతమ్మ ఎదురుచూస్తున్న ఉత్తరం వచ్చింది. డెలివరీ అయ్యేరోజు దాకా ఉద్యోగానికి వెడితే మెటర్నిటీ లీవంతా తరువాతకి వాడుకోవచ్చనీ, అందుకని ఉన్న ఊళ్లోనే పురుడు పోసుకుంటాననీ, తల్లినే రమ్మనీ కూతురు రాసింది.

"చూశారా నన్నొక్కర్తినే రమ్మని రాసింది."

"అబ్బ! ఆ సినిమా చూసిన నాటి నుంచీ నువ్వు ఎక్కువ ఆలోచిస్తున్నావు. కన్న కూతురుంటికి నన్ను రమ్మనా లేమిటి? ఇద్దరం కలిసే వెడదాం."

"బారసాల, ఉయ్యాలలో వెయ్యడం అన్నీ ఇక్కడ వేడుకలు చేద్దామనుకున్నాను. ఏమిటో నిరుత్సాహంగా ఉంది."

"పురుడయ్యాక అమ్మాయి నిక్కడకు తీసుకొచ్చి చేద్దాంలే."

మద్రాసులో రైలు దిగిన విశ్వనాథం గారినీ, పార్వతమ్మనీ కూతురు పద్మా, అల్లుడు రాజేష్ స్టేషన్‌కు వచ్చి తీసుకువెళ్లారు. కారులో బీచి రోడ్డు మీద ప్రయాణం ఎంతో బావున్నట్లనిపించింది.

"కా రెప్పుడు కొన్నారోయ్ రాజేష్?"

"ఈ మధ్యనే మామయ్యా! మీ అమ్మాయి జీతంలో అప్పు తీసుకున్నాము. నా జీతంలో లోన్‌తో ఫ్లాట్‌కొన్నాము. ఈ రోజుల్లో రెండు జీతాలు లేకుండా గడవ దసలు."

ఇల్లు చూసిన పార్వతమ్మ ఆశ్చర్యపోయింది. కలర్ టీ.వీ.వీ.సి.ఆర్. వంటివి ఇది వరకు కళ్లతోటైనా చూసింది కానీ డీప్ ఫ్రిజ్, మైక్రోవేవ్ ఓవెన్, ఆటోమేటిక్ వాషింగ్ మిషన్ వంటి వామెకి తెలియవు. ఆమె ఆశ్చర్యం చూసి పద్మ అంది.

"జాబ్ చేసే వాళ్లకు ఇవి చాలా అవసరం. అమ్మా! అసలివన్నీ లేకపోతే జాబ్ చెయ్యలేం. జాబ్‌లేకపోతే ఇవన్నీ కొనసూ లేము."

మెల్లిగా గ్యాస్ పొయ్యి, కుక్కర్ వాడడం మటుకు నేర్చుకుందావిడ. పదిరోజుల్లో ఆడపిల్ల పుట్టింది పద్మకు. అల్లుడిమొహంలో అప్రసన్నత కనిపించి నట్టనిపించింది.

"పదో రోజున బారసాల చేద్దా మిక్కడే. మీ అమ్మగారినీ, నాన్నగారినీ రమ్మని

రాయాలి. నా దగ్గరున్న అడ్రసు పాతది. అక్కడే ఉంటున్నారా?" విశ్వనాథంగారడిగారు.

"లే దండీ. ఇప్పుడు అమ్మా, నాన్నా అక్క దగ్గరుంటూన్నారు. ఉత్తరం ఎందుకు మళ్లీ. ఫోను చేసి చెప్పండి." రాజేష్ నంబర్ డయల్ చేసిస్తే పార్వతమ్మ మాట్లాడింది వియ్యపురాలితో.

"మహాలక్ష్మి వెలిసిందొదినా మీ ఇంట్లో.

"ఏమంటున్నారు ఓ ఆడపిల్ల పుట్టిందా?" వియ్యపురాలి కంఠంలో ఏమంత ఉత్సాహం ఉన్నట్లుగా లేదు.

"పద్నాలుగో తారీఖున బారసాల. మీరూ, అన్నయ్యగారూ, అమ్మాయీ తప్పకుండా రావాలి?"

"సాయంత్రం అమ్మాయి ఆఫీసునుంచి వచ్చాక ఫోను చేసి చెప్తాను ఏ సంగతీను."

ఇందులో అమ్మాయి నడగడానికి కేముందో మళ్లీ ఫోను చేసే దాకా అర్థం కాలేదు పార్వతమ్మకు.

"హల్లో ఎవరు రాజేషనా మాట్లాడేది?" అల్లుడు తల్లితో ఫోనులో మాట్లాడుతుంటే పక్కనే నిల్చుంది పార్వతమ్మ. కూతురికి ఆఫీసులో ఆడిట్ ఉందనీ, అందుకుని తామెవరికీ రావడం వీలవదనీ చెప్పిందావిడ. పోనీ వీలుని బట్టి ఏదైనా ఆదివారం పెట్టుకోవచ్చు. రమ్మనమని చెప్పమంది పార్వతమ్మ ఆడిట్ టైంలో ఆదివారాలు కూడా కూతురికి వనుంటుందనీ రాలేననీ చెప్పేసిందావిడ. పార్వతమ్మ చాలా నిరుత్సాహపడింది.

"ఇవన్నీ ఈ రోజుల్లో మామూలే. అక్కకి లీవు దొరకదు. పిల్లలతో కష్టం కదా అమ్మ ఇక్కడకు వస్తే మీరు బాధపడకండి" అన్నాడు రాజేష్.

"అయితే ఇంక అమ్మాయినీ, మనవరాలినీ తీసుకుని మా ఊ రెడతాం."

"ఇంక ఇప్పుడెందుకమ్మా. శలవు మొత్తం నాకు రెండు నెలలే. వెళ్లినా ఎక్కువ రోజులుండలేను కదా! అయినా ఇక్కడ నీకేమిటి లోటు? అన్ని సౌకర్యాలు ఉన్నాయి కదా!"

పార్వతమ్మ భర్త మొహంలోకి చూసింది "పోన్లే ఈనెలా ఉండి వెళ్లిపోదాం" అన్నట్లుందాయన చూపు.

❖ ❖ ❖

మేనకోడల్ని చూస్తామంటూ వాళ్ల కొడుకు భాస్కర్, కోడలు గీతా వచ్చారు. ఇద్దరూ డాక్టర్లే. గీత చంటి పాపను చూసి చాలా ఆరోగ్యంగా ఉందని చెప్పింది. పద్మ మోహం వికసించింది.

నాలుగు రోజులున్నాక తిరిగి ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోసాగారు భాస్కర్, గీతా.

"నాన్నా, మీరిద్దరూ కూడా మాతో వచ్చెయ్యాలి. కొడుకింట్లో తల్లి తండ్రులుండడమే లోకసామాన్యం."

విశ్వనాథంగారు గర్వంగా పార్వతమ్మ కేసి చూశారు.

"అవును మామయ్యా! మీ రిద్దరూ అక్కడకు వచ్చెయ్యండి. పిల్లలిద్దరూ కూడా మీ కోసం చూస్తుంటారు." పిల్లల్ని తన తల్లి దగ్గర ఉంచి వచ్చిన గీత అంది.

'అలాగేవెడదా'మన్నట్లు చూసింది పార్వతమ్మ. "అదేమిటిరా అన్నయ్యా ఇప్పుడు తీసుకెళ్లిపోతే ఎలా. అమ్మలేకుండా ఈ చంటి పిల్లతో నేను ఎలా సర్దుకోనూ?" పద్మ అడ్డుకుంది.

"పోన్లే, అయితే నాన్నని నేను తీసుకెడతానిప్పుడే. అమ్మని తర్వాత పంపించెయ్యి"

ఆ ఏర్పాటు అసలైన వాళ్లిద్దరికీ బాగులేదు. కానీ కొడుకు వచ్చెయ్యమంటున్నాడు. కోడలు కూడా రమ్మంటోంది. ఇప్పుడు రానంటే తర్వాత ఏమనుకుంటారో? తమ కారోగ్యాలు ఇదివరకంత బాగుండడం లేదు. చివరి రోజులు కొడుకు దగ్గరేగా వెళ్లాల్సింది! అందునా ఇద్దరూ డాక్టర్లు కూడా. ఇప్పుడు రామని చెప్పి తర్వాత వస్తామంటే బావుండదేమో? ఇప్పుడు పిలిస్తే రాలేదన్నది కొడుకు కాకపోయినా కోడలు మనస్సులో పెట్టుకుంటుందేమో? విశ్వనాథం గారి మనస్సులో, పార్వతమ్మ మనస్సులో ఆలోచనలు ఒక్కలాగే సాగుతున్నాయి. ఆరు నెలలు కాపురం చేస్తేనే వారు వీరవుతారంటారు. అరవై ఏళ్ల సంసారం వాళ్లది. ఆలోచనలు ఒక్కలా కాక ఏమవుతాయి? ఎలాగోలా రెండు నెలలు కాలక్షేపం చేస్తే సరి. చంటిపిల్ల కాస్త పెద్దదయితే ఇద్దరూ హాయిగా కొడుకు దగ్గరే ఉండచ్చు. విశ్వనాథం గారు కొడుకుతో, కోడలితో హైదరాబాద్ వెళ్లారు.

ఆ క్షణంలో ఇద్దరికీ కూతురు పద్మ ఉద్యోగస్థురాలన్న సంగతి జ్ఞాపకం లేదు.

❖ ❖ ❖

క్షేమంగా చేరామన్న కార్డు తర్వాత ఇరవై రోజులకు విశ్వనాథం గారి నుంచి పార్వతమ్మకు విశేషాలతో పెద్ద ఉత్తరం వచ్చింది. మెల్లిగా చదువుకోసాగిందావిడ.

"... చాలా పెద్ద ఇల్లు పార్వతీ. చుట్టూ తోట. బాగా డబ్బున్న వాళ్లే ఉంటారట

ఇలాంటి చోట్ల. ఇద్దరమూ డాక్టర్లం కాబట్టి ఉండగలుగుతున్నామని అన్నాడు అబ్బాయి. ఇంట్లో వంట మనిషీ, ఇద్దరు పని మనుషులు, తోటమాలీ ఉన్నారు. వంట నువ్వు చేసినట్లు లేదు. ఇద్దరూ టైం మారే డ్యూటీలు చేస్తుంటారు.

"ఇకపోతే నేను ఎదురు చూడనిది జరిగింది. కొడుకూ, కోడలూ ఇద్దరూ అంత ప్రేమగా రమ్మంటే మురిసిపోయాం కదూ! ఇది వరకు మన మనవలిద్దర్నీ కోడలి తల్లి సాయంత్రాలు స్కూల్నించి వచ్చాక చూసుకునేది. ఇప్పుడు తల్లికీ, కూతురికీ ఎందుకో - డబ్బు దగ్గర కావచ్చు - మనస్పర్థలు వచ్చాయి. ఆవిడ పిల్లల్ని చూడననేసింది. అందుకే అంత ప్రేమగా రమ్మన్నారు. ఇంట్లో ఎవరూ లేకపోతే పిల్లలు పాడై పోతారు కదా! నేను మోసపోయాను పార్వతీ! కానీ ఇక్కడే ఉంటాను. ఎందరో పిల్లల్ని తీర్చిదిద్దేను. మనవల్ని వదిలేస్తానా! నువ్వు త్వరగా వచ్చెయ్యి ఇక్కడకు."

పార్వతమ్మ నిశ్చేష్టురాలై పోయింది. ఎంత తియ్యగా పిల్చింది కోడలు. పోనీ కోడలు పరాయిది. కొడుకు కూడా ఎలా అయిపోయాడు? పోనీలే ఇంకో నెలలో తనూ వెడితే సరి. ఆయనకు ఒంటరితనం ఉండదు. భోజనానికి ఇబ్బందీ ఉండదు.

❖ ❖ ❖

నెల తర్వాత వెళ్లిపోదామింక టికెట్టు కొనమని చెప్పాలి అనుకుంటున్న పార్వతమ్మతో కూతురు పద్మ "రేపు నేను డ్యూటీలో చేరుతానమ్మా" అంది.

"అదేమిటి పిల్ల సంగతో" ఆశ్చర్యంగా అంది పార్వతమ్మ.

"పిల్ల కేమిటే నువ్వున్నావుగా"

"నేనా?"

"అవునమ్మా నువ్వు మనవరాల్ని చూసుకోవా? నీ పిల్ల ఉద్యోగంలో పైకి రావడం నీకిష్టంలేదా? ఇంట్లో అంట్లు తోముకుందుకా చదువు చెప్పించింది? అవునులే కొడుకు మీద ఉన్న ప్రేమ కూతురి మీదెలా ఉంటుంది? అక్కడే ఉండాలని ఉంటుంది."

"అది కాదమ్మా నాన్నగారక్కడ ఒక్కరూ....."

"ఒక్కరూ ఏమిటి? అన్నయ్యా ఒదినా ఉన్నారుగా. ఇంటి నిండా పనివాళ్లు. ఆయన కేమిటి తక్కువ? ఆ పల్లెటూళ్లో, పెంకుటింట్లో ఏమిటి మీకు సుఖం? మా ఇద్దరి దగ్గరా హాయిగా ఉండండి. నీకు పనేమీ కూడా ఉండదు. పనిమనిషుంది. ఆదివారం అన్ని వంటలూ చేసి డీప్‌ఫ్రిజ్‌లో పెడతాను. రోజూ మైక్రోవేవ్‌లో వెచ్చపెట్టి పెడతాను. ఆకుంపట్లూ, కిర్సనాయిల్ స్టవ్వూ నీకేమిటక్కడ సుఖం? హాయిగా ఉండిక్కడ."

పార్వతమ్మ ఏం మాట్లాడలేకపోయింది. మర్నాడు పద్మ డ్యూటీలో జాయినయ్యింది.

చాలా పనిమంతురాలు పద్మ. అన్నీ ప్లాన్ చేసి వంటపనీ చేసేది పిల్లను చూసుకోడ మొక్కటే పని పార్వతమ్మకు. కానీ అదే చాలా కష్టంగా ఉండేది. ఏ టైంలో ఏడుస్తుందో, ఎప్పుడు పాలు తాగించాలో, ఎప్పుడు ఎత్తుకు తిప్పాలో, జో కొట్టాలో. దీనికన్నా కూతురు చీదరించుకున్న కుంపటి వంటా, నీళ్ల మోతా సులువనిపించేవి. అన్నిటికన్నా మనస్సు భర్తమీద ఉండేది. ఆయనేం ఇబ్బంది పడుతున్నారో ఏమో? అనుక్షణం ఆలోచిస్తూ ఉండేది.

ప్రమోషన్ కోసం అదనపు అర్హతలు కావాలంటే నైట్ క్లాసుల్లో చేరింది పద్మ. భాషరాని ఊళ్లో బిక్కు బిక్కుమంటూ ఉండడం కష్టంగా ఉండేది పార్వతమ్మకు. తల్లి కష్టం పద్మకు అర్థం కాలేదు. ఒక పనిమనిషిని తీసుకొచ్చిందొక నాడు. మాట్లాడుతుంటే భాషరాని పార్వతమ్మ అడిగింది "పనిమనిషుందిగా అమ్మాయ్ ఇంకొకర్తెందుకు?"

"నీకిక్కడ కష్టంగా ఉందిగా. దీన్ని పిల్లను చూడ్డానికి పెడతాను. నువ్వెళ్లిపోవచ్చు" నిష్ఠూరంగా అంది పద్మ.

కంట్లో పువ్వు, చేతుల్నిండా పుళ్ళు గులాబీ పువ్వులాంటి మనవరాల్ని దీనిచేతిలోనా పెట్టడం.

"పర్వా లేదమ్మా ఉంటాను".

❖ ❖ ❖

నాలుగు రోజులకి విశ్వనాథంగారి నుంచి ఉత్తరం వచ్చింది. క్షేమ సమాచారాల తర్వాత ఇంకా రాశారాయన. "... ఈ మధ్య రాత్రికొద్దిగా గుండె నొప్పి వచ్చింది. అబ్బాయి ఏదో కాన్ఫరెన్సుకు ఊరెళ్లాడు. కోడల్ది నైట్ డ్యూటీ. ప్రొద్దుటే ఆవిడ అలసిపోయి వస్తే చెప్పడానికి మొహమాటమనిపించింది. తగ్గిపోయిందిలే. నువ్వుంటే ఏ అమృతాంజ నమో రాసే దానివి కదా అనుకున్నాను"

చాలా బెంగగా అనిపించిందావిడకు. సాయంత్రం వచ్చిన కూతురికి ఉత్తరం చూపించి "ఒక్క నాలుగు రోజులు శలవు పెట్టమ్మా, నాన్నగారిని చూసి వస్తాను" అంది.

"తగ్గిపోయిందని రాశారుగా నాన్న. ఇప్పుడు శలవు దొరకదు. ఎలా ఉందో కావలిస్తే ఫోను చేసి మాట్లాడు."

నంబరు తిప్పి ఫోను చెయ్యడం నేర్చుకుందావిడ. ఫోన్లో పార్వతమ్మ కంఠం విన్న విశ్వనాథం గారు ఆనందంతో పరవశించిపోయారు.

"పార్వతీ, బావున్నావా?"

"నేను బావున్నాను కానీ మీరెలా ఉన్నారు. నొప్పి తగ్గిందా."

రెండు నిముషాలు మాట్లాడాక "ఇంక పెట్టెయ్యి. డబ్బు చాలా అవుతుంది." అన్నారాయన. ఫోను పెట్టేసి కూతుర్నడిగింది. పార్వతమ్మ.

"అమ్మాయ్! ఎంతవుతుంది ఇప్పుడు మాట్లాడినదానికి?"

"ఎంతయితే నేమిటి? నీ కూతురి జీతమెంతో తెలుసా? హాయిగా ఎంత సేపైనా మాట్లాడుకో.

నువ్వు సుఖపడ్డానికి కాకపోతే ఈ సంపాదన ఎందుకు?"

సుఖానికి నిర్వచనమేమిటో తల్లికి తెలియలేదు.

❖ ❖ ❖

చంటి పిల్ల సంరక్షణలో భర్త మీద బెంగతో శారీరకంగా, మానసికంగా అలసిపోయి జ్వరపడింది. పార్వతమ్మ. తల్లి అనారోగ్యానికి అందర్నీ అదరగొట్టేసింది పద్మ. అంత మంది డాక్టర్లూ, అన్ని రకాల టెస్టులూ ఎందుకో ఆవిడకు అర్థం కాలేదు. చివరకు నీరసానికి టానిక్కూ, బి-కాంప్లెక్సు ఇంజెక్షన్లూ రాసిచ్చారు. ఆవిడకు ఒంట్లో బావులేనప్పుడు పిల్లను చూడ్డానికి తల్లిని రప్పించాడు రాజేష్. బారసాలకి రమ్మని పిల్చినారాని ఆవిడ ఇప్పుడింత త్వరగా ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోయింది. పార్వతమ్మ.

"బావున్నారా వదినా? అన్నయ్యగారెలా ఉన్నారు?"

"అంతా బావున్నాము. మా అమ్మాయీ, అల్లుడూ ఊళ్లో లేరు. ఆయన్ని పిల్లల్ని చూడమని నేనిలా వచ్చాను" భర్తను వదిలి ఉండడం సామాన్యంగా మాట్లాడుతోం దావిడ.

"ఒక్కరికీ మీరు లేకపోతే కష్టం కాదా?"

"కష్టమేముంది? ఆ దిక్కుమాలిన పల్లెటూళ్లో మేం ఇద్దరం ఉంటే మాత్రం కష్టం కాదా? ఇక్కడన్ని సదుపాయాలు ఉంటాయి. హాయిగా ఉండచ్చు. ఇంకెలాగూ విడిగానే ఉంటాం. మాచిన్నమ్మాయికి డెలివరీ టైమ్ నేనక్కడ, ఆయన పెద్దమ్మాయి దగ్గర. ఎంత మూడేళ్లేగా".

"నేనూ అదే మా అమ్మాకి చెప్తున్నా నత్తయ్యా. మూడేళ్లేగా విడిచి ఉండడం అని. ఆ తర్వాత పాపను బోర్డింగు స్కూల్లోవేసేస్తాను" అంది.

మూడేళ్లు మూడు నిముషాల్లా మాట్లాడుతోంది కూతురు. వియ్యపురాలికీ ఈ విషయం ఏం బాధ కలిగించడం లేదేమిటి? మమకారాల్ని వదిలి ధనార్జన వైపుకే

పోతోంది లోకమంతాను. ఈకాల ప్రవాహానికి తనొక్కర్తే ఎదురీదుతోందా? అయినా తనూ వాలుకే కొట్టుకు పోతోంది కదా!

❖ ❖ ❖

పార్వతమ్మకి ఒంట్లో బాగులేదని తెలిసిన వెంటనే విశ్వనాథంగారు ఫోను చేశారు. ఆయన కంఠంలో ఎంతో ఆదుర్దా.

"ఎలా ఉన్నావు పార్వతీ? జ్వరం తగ్గిందా?"

ఆ ఆదుర్దాకి ఆమె కంఠం రుద్ధమయింది.

"తగ్గిందండీ. ఏం లేదు. నీరసంట. బి-కాంప్లెక్సు ఇంజెక్షన్లు వారానికి రెండు చేయించుకోవాలిట."

'ఇంజెక్షన్లా? నీకు భయం కదా. భయపడకు. జాగ్రత్తగా చేయించుకో. వద్దామంటే కోడలు కాన్ఫరెన్సు కెళ్లింది.

ఎన్నో ఏళ్ల కిందటి కంఠం వినిపించిందావిడకు. దెబ్బ తగిలితే ఎండలో సైకిలు మీద వెళ్లి ఇంజెక్షన్ తెచ్చిన్నాటి కంఠం. చిన్నపిల్ల పార్వతి ఇంజక్షన్‌కి భయపడి పారిపోబోతే పరిగెత్తకుండా పట్టుకుని భయంలేదని చెప్పి ఇంజెక్షన్ చేయించిన నాటి కంఠం. భార్య బాధకి ఆనాడూ ఈనాడూ అదే ఆత్రుత. కానీ ఆనాడు నేనున్నానన్న ధీమా. ఈనాడు ఉండీ ఏం చెయ్యలేనన్న బాధ. పార్వతమ్మ గుండె గొంతుకలోకి వచ్చినట్లుంది.

"ఏం లేదు. నేను బాగానే ఉన్నాను. భయం లేదు"

"ఏమిటి విశేషాలు?"

"ఈవేళ పద్మ చిక్కుడుకాయ వండింది. మీకిష్టం కదా! ముద్ద దిగలేదు."

ఆనాటి పార్వతిని, అమ్మమ్మ చేసిన అరిసెలు రహస్యంగా తెచ్చిపెట్టిన పార్వతిని తలుచుకున్నారు. ఎంత నిస్సహాయత!

ఇద్దరి మనస్సులో ఒక్కటే భావాలు. పిల్లలు తల్లిదండ్రుల బాధ్యతను డబ్బుకోసం పంచుకోరనుకున్నారు. కానీ డబ్బు కోసం పిల్లలు వాళ్ల పిల్లల్ని సంరక్షణ చేసే హక్కుని పంచుకుంటారని ఏనాడూ ఊహించలేకపోయారు. ఏనాడైనా ధన వ్యామోహం మమకారం కన్నాగొప్పదేనా? ఏమో కాలం ఎప్పటికైనా మారకపోతుందా?

(ఆంధ్రప్రభ వీక్లీ)